సామాన్యుడి ఆయుధం

# తెలంగాణ ప్రభ

మంగళవారం, ఆగస్టు 08, 2024

డిజిటల్

తెలంగాణ ప్రభ, (హైదరాబాద్) : రాష్ట్రానికి అత్యధిక పెట్టుబడులు తీసుకురావడంలో భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అమెరికాలోని తెలుగు రాష్ట్రాల ప్రవాసులకు పిలుపునిచ్చారు. న్యూజెర్సీలో ఆదివారం జరిగిన ప్రవాసుల ఆత్మీయ సమ్మేళానికి వేలాది మంది తరలివచ్చారు. ఈ సందర్భంగా దారిపొడవునా భారీ ర్యాలీతో ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ "తెలంగాణ మీ జన్మభూమి, మీ దేశంలో మీరు పెట్టిన ప్రతి పెట్టుబడికి తప్పకుండా ప్రయోజనం ఉంటుంది. అంతకు మించిన అత్యుత్తమ ప్రతిఫలం ఉంటుంది. మన ప్రాంత అభివృద్ధిలో భాగస్వామ్యం పంచుకుంటే అంతకు మించిన సంతృప్తి బోనస్ గా లభిస్తుంది..' అని ఎన్నారైలలో ఉత్సాహం నింపారు. "గత సంవత్సరం టీపీసీసీ అధ్యక్షుని హోదాలో అమెరికాకు వచ్చాను. పదేండ్ల పాటు సాగిన దుష్పరిపాలనకు, విధ్వంసాలకు విముక్తి పలికి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే మళ్లీ వస్తానని చెప్పాను. నేను ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాను'' అన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని తమ ప్రభుత్వం నిలబెట్టుకుంటుందని ముఖ్యమంత్రి పునరుద్ఘాటించారు. ఇప్పటికే రైతులు, మహిళలు, యువకుల సంక్షేమం, అభివృద్ధికి ఎన్నో కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీతో పాటు, ఇన్ పుట్ సబ్సిడీగా రైతు భరోసా, నిరుద్యోగులకు ఉద్యోగాలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కు వంట గ్యాస్ సిలిండర్, నిరుపేదలకు 200 యూనిట్ల ఉచిత గృహ విద్యుత్తు, ఉపాధ్యాయులకు పదోన్నతులు, విద్యార్థులకు నాణ్యమైన విద్య పథకాలను అమలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఇది ప్రారంభం మాత్రమే అని.. భవిష్యత్తు ప్రణాళికలతో తమ ప్రభుత్వం ముందుకు వెళుతుందన్నారు. తమ పరిపాలనపై ఎలాంటి అపోహలు, ఆందోళనలకు తావు లేదని, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని సమ్మిళిత ఆర్థిక వృద్ధిని వేగంగా సాధించే తమ ప్రభుత్వం కొత్త పారిశ్రామిక విధానాన్ని తీసుకు వస్తుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. నిధుల సమీకరణతో పాటు ఎక్కువ మందికి ఉపాధి కల్పన, నైపుణ్యాల వృద్ధికి అందులో సమానమైన ప్రాధాన్యమిస్తామని చెప్పారు. ఎన్నికల ముందు మాపై ఎంతో విష ప్రచారం జరిగింది.. గిట్టని వాళ్లందరూ అసలు కాంగ్రెస్ అధికారంలోకి రాదని అన్నారు. వచ్చినా అది ఉండనే ఉండదన్నారు. ఇప్పుడు రాష్ట్రంలో అభివృద్ధి మందగిస్తుందంటూ లేని పోని అపోహలు కల్పించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే వాళ్లకు తగిన బుద్ధి చెప్పాం. అబద్ధాలకోరుల మాటలు తప్పని మరోసారి నిరూపిస్తాం. హైదరాబాద్‌ను భారతదేశంలోనే కాదు.. ప్రపంచంలోనే అగ్రగామి నగరంగా అభివృద్ధి చేసేందుకు పోటీ పడతాం...' అని సీఎం ప్రకటించారు. మీ నైపుణ్యాలు, మీ ప్రతిభా పాటవాలతో అమెరికాను పటిష్టంగా, సంపన్నంగా మార్చారని ప్రవాసులను ముఖ్యమంత్రి అభినందించారు. ఇకపై తెలంగాణకు మీ సేవలు అందించాలని స్వాగతించారు. తెలంగాణలో మెట్రో కోర్ అర్బన్ తో పాటు , సెమీ అర్బన్, రూరల్ క్లస్టర్లుగా విభజించి పెట్టుబడులకు ప్రత్యేకమైన వ్యవస్థలను రూపొందిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా అమెరికాలోని ఈస్ట్ కోస్ట్ ఇండియన్ కమ్యూనిటీకి చెందిన పలువురు ముఖ్యులతో సీఎం మాట్లాడుతూ, హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ తరహాలో నాలుగో నగరంగా ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ప్రపంచ స్థాయి మాస్టర్ ప్లాన్ తో హైదరాబాద్ ను అత్యున్నత స్థాయి నగరంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. హైదరాబాద్ ను అభివృద్ధి చేసేందుకు మీరందరూ కలిసి రావాలని ప్రవాసులకు సీఎం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలు, వాగ్దానాలను నెరవేర్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న కృషిని ఎన్నారైలు అభినందించారు. హైదరాబాద్ అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలను, భవిష్యత్తు ప్రణాళికలను అందరూ ప్రశంసించారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలనే ప్రచారంలో ప్రభుత్వంతో కలిసి పాల్గొంటామని హామీ ఇచ్చారు. అంతకుముందు తెలంగాణ సంస్కృతిని చాటిచెప్పే పాటలు, నృత్యాలతో కూడిన భారీ ప్రదర్శనను చిన్నారులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రికి స్వాగతం పలికిన ఓవర్సీస్ కాంగ్రెస్ పార్టీ అమెరికా అధ్యక్షుడు మొహిందర్ సింగ్ గిల్జియాన్ మాట్లాడుతూ.. 'మిమ్మల్ని ముఖ్యమంత్రిగా చూడాలన్న మా కోరిక నెరవేరింది. ఇప్పుడు రాహుల్ గాంధీని భారత ప్రధానిని చేయడానికి మనమందరం కష్టపడాలి...' అన్నారు. సాఫ్ట్‌వేర్, ఫార్మా, వ్యాక్సిన్‌లు, హెల్త్‌కేర్, అర్టిఫిషియల్ రంగాల్లో తెలంగాణ బలమైన స్థావరంగా ఎదగాలని ఆకాంక్షించారు.



# తెలంగాణలో పెట్టుబడి పెట్టండి

న్యూజెర్సీలో ప్రవాసులతో సీఎం రేవంత్‌రెడ్డి    అభివృద్ధిలో భాగస్వామ్యం పంచుకోండి

## ప్రజావాణికి 112 దరఖాస్తులు

### స్వీకరించిన అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్



**తెలంగాణ ప్రభ (సిరిసిల్ల) :** జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 112 దరఖాస్తులు వచ్చాఇ . ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ హాజరై ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ మాట్లాడారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులు నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. రెవెన్యూ శాఖకు 69, సిరిసిల మున్సిపల్ కార్యాలయానికి 16, ఉపాధి కల్పన శాఖకు 8, డీపీఓ కార్యాలయానికి 4, డీసీసీడీఓ కు 3, డీఎంహెచ్ఓ కార్యాలయానికి 2, కోనరావుపేట, ఎలారెడ్డిపేట, బోయినపల్లి ఎంపీడీఓ కార్యాలయాలకు, వేములవాడ మున్సిపల్ కార్యాలయం, అటవీ శాఖ, వ్యవసాయ శాఖ, ఎల్డీఎం, ఎస్డిసీ, డీబీసీడీఓ, వైద్య శాఖకు ఒకటి చొప్పున దరఖాస్తు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

WANTED

సమాజంపై అవగాహన, బాధ్యత కలిగి నిజాన్ని నిర్భయంగా రాయగలిగి, మంచికోసం పని చేయగలననే నమ్మకం ఉన్న ప్రతి ఒక్క రిపోర్టర్‌కి

'తెలంగాణ ప్రభ డిజిటల్ పత్రిక'

ఆహ్వానం పలుకుతుంది. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం.. కొత్త వారికి అవకాశం కల్పిస్తున్నది.


ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి

సెల్:99854 44342



## పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**తెలంగాణ ప్రభ (కోటగిరి) :** కోటగిరి ఉమ్మడి మండల లోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని అధికారులు ప్రజాప్రతినిధులు నిర్వహించారు. విద్యార్థులు పాఠశాల నుండి బస్టాండ్ వరకు ర్యాలీగా వచ్చి అంబేద్కర్ చౌరస్తాలోని అధికారులతో పాటు విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ ....ఇంటి చుట్టుపక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మొక్కలను ప్రతి ఒక్కరు నాటి వాటిని కాపాడాలని అన్నారు .ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కేఆర్ మనోహర్ రెడ్డి ఈవో ముజఫర్ బేగ్ అంగన్వాడీ టీచర్లు గ్రామపంచాయతీల కార్యదర్శిలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



## యువకుడి ఆత్మహత్య

**తెలంగాణ ప్రభ (రాజన్న సిరిసిల్ల) :** సోమవారం ఉదయం 11:30 గంటల సమయంలో స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం తంగళ్ళపల్లి మండల కేంద్రానికి చెందిన కొండ లక్ష్మీరాజం గత కొద్ది రోజుల నుండి హోటల్ నడుపుతూ జీవితం కొనసాగిస్తున్నాడని తెలిపారు. కొద్ది రోజులుగా కుటుంబ కలహాలతో సతమతమవుతున్నాడని, జీవితం మీద విరక్తి చెంది తన హోటల్లోనే ఎవరు లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని వెల్లడించారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందివ్వగానే స్థలానికి పోలీసులు చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతునికి భార్య వైశాలి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతికి గల పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

# ప్రకృతి ప్రేమికుడికి రాష్ట్రస్థాయి పురస్కారం



**తెలంగాణ ప్రభ, (సిరిసిల్ల) :** ప్రకృతి ప్రేమికుడికి రాష్ట్రస్థాయి పురస్కారం తెలంగాణ రాష్ట్ర పర్యావరణ ప్రేమికుల సదస్సులో ప్రకృతి సేవారాష్ట్ర పురస్కారం అందుకున్న ప్రకృతి ప్రకాష్ మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోనీ మానుకోట ఇందిరానగర్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో ఆదివారం తెలంగాణ రాష్ట్రస్థాయి పర్యావరణ ప్రేమికుల సదస్సును మహబూబాద్ జిల్లా హరిత మిత్ర అవార్డు గ్రహీత పర్యావరణ ప్రేమికుడు దైద వెంకన్న నిర్వహించారు, తెలంగాణ రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా ముందుకు సాగుతున్న ప్రకృతి ప్రేమికుల సేవలను గుర్తించి రాష్ట్ర స్థాయిలో ప్రతి జిల్లా నుండి ప్రకృతి ప్రేమికులను ఆహ్వానించి సదస్సులు నిర్వహించి వారి సేవలను గుర్తించి రాష్ట్రస్థాయి సేవ పురస్కారాన్ని అందజేశారు, రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన పర్యావరణ ప్రేమికుడు డా,ప్రకృతి ప్రకాష్ ను రాష్ట్రస్థాయి సదస్సుకు ఆహ్వానించి అందరి సమక్షంలో రాష్ట్ర స్థాయి సేవ పురస్కారాన్ని మహబూబాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న మొక్కల వెంకటయ్య డాక్టర్ నర్మద జలగం వీరస్వామి డాక్టర్ కె కమల రాణి, కొమ్మిరే అప్పలయ్య మార్నేనికిరణ్ , చేతులమీదుగా రాజన్న సిరిసిల్ల జిల్లా సుద్దాల గ్రామానికి చెందిన పర్యావరణ ప్రేమికుడు డాక్టర్ ప్రకృతి ప్రకాష్ కు ప్రకృతిరాష్ట్ర సేవ పురస్కారాన్ని, ప్రకృతి ప్రకాష్ కు అందజేశి అభినందించారు, ప్రజా హృదయం సోషల్ సర్వీస్ సొసైటీ, తెలంగాణ రాష్ట్ర పర్యావరణ ప్రేమికుల సదస్సు ప్రోగ్రాం వ్యవస్థాపకులు హరిత మిత్ర అవార్డు గ్రహీత దైద వెంకన్న మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ పట్ల ప్రకాష్ చేస్తున్న సేవలు ఘనమైనవని ప్రకృతి ప్రేమికులు చేస్తున్న సేవ ద్వారానే జీవకోటి మనగడ ఇంకా కొనసాగుతుందని ప్రతి ప్రకృతి ప్రేమికుడు పర్యావరణ పరిరక్షణ పట్ల ఉద్యమంలా సాగాలని అన్నారు. ప్రకృతి ప్రకాష్ మాట్లాడుతూ, నేను చేస్తున్న ఈ సేవలను గుర్తించి ఇచ్చిన ఈ పురస్కారం నాకు ఇంకా బాధ్యతలను పెంచిందన్నారు, మానవ మనుగడ సాగించాలంటే పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు, కొందరు తమ సంపద తమ స్వార్థాల కోసం, అడవులను నరికేస్తూ గుట్టలను సైతం పిండి చేస్తున్నారని, పోరాటంతోనే పర్యావరణ పరిరక్షణ జరుగుతుందని వివరించారు మానవులు లేకుంటే చెట్లు జీవిస్తాయి కానీ చెట్లు లేకుంటే మానవులు జీవించలేరని ప్రతి ఒక్కరూ చెట్టు విలువను గుర్తించి అడవి కుట్టలను సైతం కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో,వివిధ జిల్లాలో నుండి వచ్చిన ప్రకృతి ప్రేమికులకు రాష్ట్రస్థాయి సేవ పురస్కారాలను అందజేశారుఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న మొక్కల వెంకటయ్య డాక్టర్ నర్మదా జలగం వీరస్వామి కొమిరే అప్పలయ్య మారినేని కిరణ్ తెలంగాణరాష్ట్ర, జిల్లాల ప్రకృతి ప్రేమికులు దార్ల వెంకటేశ్వర్లు సాంబన్న రావట్ల జనార్ధన్ కొలిపాక ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



# శాశ్వత పరిష్కారం కోసమే ప్రయత్నిస్తున్నాం

- కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గం ఇంచార్జ్ కేకే మహేందర్ రెడ్డి
- సిరిసిల్ల ప్రజల నమ్మకం కోల్పోయిన కేటీఆర్

**తెలంగాణ ప్రభ (సిరిసిల్ల ) :** సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో సమస్యలను శాశ్వతంగా పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నామని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జ్ కేకే మహేందర్ రెడ్డి అన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కేకే మహేందర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం చేసి ప్రజలకు న్యాయం చేస్తామని గెలిచి ప్రజలకు చేసిందేమిటని బిఆర్ఎస్ నుంచి ఉద్దేశించి సూటిగా ప్రశ్నించారు. బతుకమ్మ చీరల ఆర్డర్ తో ఆదుకుంటామని బజారు పాలు చేశారని కేటీఆర్ ను ఉద్దేశించి అన్నా రు. కాటన్ పాలిస్టర్ డైయింగ్ వ్యవ స్థలు పూర్తిగా భ్రష్టు పట్టిపోయాయని అన్నారు. స్పిన్నింగ్ మిల్ నడిపిస్తే 1200 మంది మహిళలకు ఉపాధి అవకాశాలు ఉండేవని రియల్ ఎస్టేట్ గా మార్చి అమ్ముకున్నారని ఆరోపించారు. బతుకమ్మ చీరలపై కుంభ కోణం జరిగిందని అప్పట్లోనే ఆరోపణలు చేశామని అన్నారు. సిరిసిల్ల పట్ల కేటీఆర్ కు చిత్తశుద్ధి లేదని ఇక్కడ ప్రజలపై నమ్మ కం ఉంటే మెగా టెక్స్టైల్ పార్క్ వరంగల్ కు ఎందుకు పోయిందని ప్రశ్నించారు. నేత కార్మికులు 14 రోజులు దీక్షలు చేస్తే ఒక్కరోజైన దీక్ష లో కూడా కూర్చోకపోవడంపై మండిపడ్డారు. ఇక్కడ ప్రజల దయతో గెలిచిన కేటీఆర్ సిరిసిల్ల ప్రాంతం సమస్యలు పరిష్కరించబడును దారుణమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇక్కడ ప్రజలపై ఉన్న ప్రేమతో వంద కోట్ల బతుకమ్మ చీరల బకాయిలు విడుదల చేయడంతో పాటు 10 హెచ్పి ల వరకు 50 శాతం విద్యుత్ సబ్సిడీ ఇస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు నాగుల సత్యనారాయణ, గడ్డం నర్సయ్య, గోనె ఎల్లప్ప,ఎల్లె లక్ష్మీనారాయణ, భీమారపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డెక్కిన న్యాయవాదులు

**తెలంగాణ ప్రభ (సిరిసిల్ల) :** న్యాయం చేసి న్యాయవాదులే న్యాయం కోసం రోడ్లపైకి వచ్చిన ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లాలో చోటుచేసుకుంది. సిరిసిల్ల జిల్లా కోర్టు నుంచి ప్రెస్ క్లబ్ వరకు పాదయాత్ర చేపట్టి అనంతరం ప్రెస్ క్లబ్లో పాత్రికేయ సమావేశం నిర్వహించారు. వివరాల్లోకి వెళితే.. సివిల్ కేసులలో పోలీసులు అనవసరంగా తలదూర్చి క్రిమినల్ క కేసులుగా మారుస్తున్నారని అన్నా రు.కక్షిధారునికి కోర్టు ఇచ్చిన ఆర్డర్ను తుంగలో తొక్కి దాన్ని పట్టించుకోకుండా కోర్టు వారు ఇచ్చిన ఉత్తరువుదారును పైననే క్రిమినల్ కేసులు పోలీసులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఐదు రోజులుగా కోర్టు విధులు బహిష్కరించినప్పటికిని పోలీసు శాఖలో ఎలాంటి చలనం లేదని ఆరోపించారు. ఇకనైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి సివిల్ కేసులలో జోక్యం చేసుకోకుండా చట్టాన్ని కోర్టును గౌరవించాలని కోరారు. లేని పక్షంలో న్యాయం చేసేదాకా కోర్టు విధులు బహిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు దోర్నాల సంజీవరెడ్డి ప్రధాన కార్యదర్శి తంగళ్ళపల్లి వెంకటి సీనియర్ జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.



# డౌన్స్ సిండ్రోమ్స్ అంటే?

డాక్టర్ కందేపి రాణీప్రసాద్






మానసిక రుగ్మతలు పెద్దవాళ్ళకు వలె పిల్లలకూ ఉంటాయని ముందు వ్యాసంలో తెలుసుకున్నాం కదా! కొన్ని రుగ్మతలు పిల్లలు పుట్టిన తరువాత వస్తాయి. కొన్ని రుగ్మతలు పుట్టుకతోనే వస్తాయి. పిండం కడుపులో ఉండగానే ఏర్పడే విధానంలో కొన్ని వ్యాధులు ఉత్పన్నమవుతాయి. పిల్లలు పుట్టాక వచ్చే వ్యాధులు వాతవరణం, పరిస్థితుల కారణంగా ఏర్పడితే, పుట్టుకతో వచ్చే వ్యాధులు మాత్రం పిండం ఏర్పడే దశలో కలిగే లోపాల కారణంగా ఉద్భవిస్తాయి. ఇలా పుట్టుకతో వచ్చే లోపాలు వ్యాధులు చాలా వరకు తగ్గకపోవచ్చు. కానీ వారు ఎవరి సహాయం లేకుండా జీవించేందుకు పుట్టిన పిల్లలకు, తల్లి దండ్రులకు ట్రైనింగ్ అవసరం ఉంటుంది. వీటి కోసం సుశిక్షితులైన పిల్లల మానసిక వైద్య నిపుణులు ఉన్నారు. వ్యక్తిత్వ వికాస నిపుణులు, స్పీచ్ థెరపిస్టులు మటి అనేక మంది పారామెడికల్ సిబ్బంది కూడా ఉంటారు వీరందరి సహాయంతో అవగావన పెంచుకోవాలి. ఇప్పుడు పుట్టుకతో వచ్చే వ్యాధుల్లో డౌన్స్ సిండ్రోమ్ అనే వ్యాధి గురించి తెలుసుకుందాం!

డౌన్స్ సిండ్రోమ్ అనేది పుట్టుకతో వచ్చే వ్యాధని తెలుసుకున్నాం కదా! ఇది పిల్లలకు మానసిక, శారీరక సవాళ్ళను ఏర్పరుస్తుంది. అసలు ఎందుకు వస్తుంది అంటే ఒక క్రోమోసోమ్ ను అధికంగా కలిగి ఉండటం వలన వస్తుంది. సాధారణ వ్యక్తులకు దేహంలో 23 జతల క్రోమోసోములు ఉంటాయి. అంటే 46 క్రోమోసోముల్ని కలిగి ఉంటారన్న మాట. కానీ డౌన్స్ సిండ్రోమ్ ఉన్న వ్యక్తులకు 47 క్రోమోసోములు ఉంటాయి. ఈ అదనపు క్రోమోసోమ్ బిడ్డ ఎదుగుదలను శాసిస్తుంది. సాధారణ పిల్లలు పెరిగినట్లుగా వీరి పెరుగుదల ఉండదు. దోగాడాల్సిన వయసులో దోగాడకపోవడం, నడవాల్సిన సమయంలో నడవకపోవడం, మాటలు చాలా ఆలస్యంగా రావడం వంటి 'డిలేడ్ మైల్ స్టోన్స్' ను కలిగి ఉంటారు.

డౌన్స్ సిండ్రోమ్ ఉన్న పిల్లలకు శారీరక సమస్యలే కాకుండా ముఖంలో మార్పులు కూడా కనిపిస్తాయి. వాళ్ళు చేసే పనుల్లోనే తేడా ఉండటం కాకుండా శరీరంలో కనిపించే మార్పులు కూడా ఉంటాయి. ముఖం చదునుగా ఉండటం, వాలుగా ఉండే బాదం ఆకారపు కళ్ళు. అణిగినట్లుండే ముక్కు, బయుటకు వస్తున్నట్లుగా ఉండే నాలుక వంటి ముఖంలో మార్పులు కనిపిస్తాయి. ఇంకా మెడ చిన్నదిగా ఉంటుంది. చెవులు కూడా చిన్నవిగా ఉంటాయి. ఎత్తు చాలా తక్కువగా పెరుగుతారు చేతులు కాళ్ళు కూడా చిన్నగా కనిపిస్తాయి. అరచేతిలో ఒకే గీత ఏర్పడుతుంది. శరీరంలోని కండరాలు బలహీనంగానూ, కీళ్ళు వదులుగానూ ఉంటాయి. ఇంకా' అబ్స్ట్రక్టివ్ స్లీప్ ఆప్నియా' అనే డిజార్డర్ కు లోనవుతారు. వినికిడి లోపం కూడా ఉండవచ్చు కొంతమందికి పుట్టుకతో వచ్చే గుండె వ్యాధులు వచ్చే అవకాశముంది. ఇలా ఎన్నోరకాల సమస్యలను వ్యాధిగ్రస్తులు ఎదుర్కోవలసి వస్తుంది సమాజం మరియు కుటుంబ సభ్యులు వారితో దయగా ప్రదర్శించవలసి ఉంటుంది.

డౌన్స్ సిండ్రోమ్ అనే వ్యాధిని మూడు రకాలుగా విభజించవచ్చు. దాదాపుగా మూడు రకాల డౌన్స్ సిండ్రోమ్ ఉన్న వ్యక్తుల భౌతిక లక్షణాలు, ప్రవర్తనలు చూడటానికి ఒకేలా అనిపిస్తాయి. మొదటి రకాన్ని 'ట్రిసోమీ 21' అని పిలుస్తారు దాదాపుగా డౌన్స్ సిండ్రోమ్ ను గుర్తించిన పిల్లల్లో 95శాతం మంది 'ట్రిసోమి 21' కలిగి ఉంటారు. వీరి శరీరంలోని ప్రతి కణం క్రోమోసోమ్ 21 లో మూడు వేర్వేరు కాపీలను కలిగి ఉటుంది.

రెండవరకం ట్రాన్స్ లొకేషన్ డౌన్ సిండ్రోమ్ గా పిలవబడుతుంది. ఈ రకం చాలా తక్కువ మందికి సంక్రమిస్తుంది కేవలం 3% మందికి మాత్రమే ఈ ఫ్రాన్స్ లొకేషన్ డౌన్ సిండ్రోమ్ వస్తుంది క్రోమోసోమ్ 21 లో అదనపు క్రోమోసోమ్ ను కలిగి ఉటుంది. లేదా మరొక క్రోమోసోమ్ వచ్చి అదనంగా అతకబడి ఉంటుంది. అందుకే దీనిని ట్రాన్స్ లొకేషనే డౌన్ సిండ్రోమ్ అని అంటారు.

మూడవ రకాన్ని మొజాయిక్ డౌన్ సిండ్రోమ్ అని పిలుస్తారు. ఇందులో క్రోమోసోమ్ 21 లో మూడు వేర్వేరు కాపీలు ఉంటాయి. ఈ పరిస్థితిని ట్రైసోమీ 21 లో కూడా చూశాం. అయితే ఇందులో కొన్ని కణాల్లోని క్రోమోసోములు రెండు కాపీలను మాత్రమే కలిగి ఉంటాయి అంటే కొన్ని కణాలు మూడు కాపీల క్రోమోసోమ్ లను, కొన్ని కణాల్లో రెండు కాపీల క్రోమోసోమ్ లు ఉంటాయి. అంటే మిశ్రమంగా కలసి ఉంటాయి అన్నమాట. 'మొజాయిక్' అంటే మిశ్రమ కలయిక అని అర్ధం. ఈ పరిస్థితి ఉన్న డౌన్ సిండ్రోమ్ వ్యాధిగ్రస్తులు 2శాతం మంది మాత్రమే ఉంటారు.

డౌన్స్ సిండ్రోమ్ వ్యాధి ఎందుకు వస్తుందో ఖచ్చితమైన ఆధారాలు లెనప్పటికీ కొన్ని కారణాలను గుర్తించారు. 35 సంవత్సరాల వయసు దాటిన స్త్రీలు గర్భవతులు అయినట్లైతే డౌన్స్ సిండ్రోమ్ వ్యాధి ఉన్న బిడ్డ పుట్టేందుకు అవకాశం ఉన్నది. స్త్రీలకు ఎక్కువ వయసులో గర్భం దాల్చడం వలన ఎన్నో సమస్యలు ఏర్పడతాయి. వారికి వచ్చే అనేక ఆరోగ్య సమస్యల్లో డౌన్స్ సిండ్రోమ్ వ్యాధి ఉన్న పిల్లలు కూడా పుట్టుడం ఒకటి. అయితే తక్కువ వయసు కలిగిన స్త్రీలకు కూడా ఈ సమస్యల బిడ్డలు జన్మించడం చూస్తున్నాం.

గర్భ ధారణ సమయంలోనే లోపల పిండం ఎలా పెరగుతుందో తెలుసుకోడటానికి పరీక్షలు ఉన్నాయి. డౌన్స్ సిండ్రోమ్ రుగ్మతను కనుక్కోవడానికి గర్భవతిగా ఉన్నపుడు చేయటానికి రెండు రకాల పరీక్షలున్నాయి. తల్లి గర్భం డౌన్స్ సిండ్రోమ్ కు ప్రభావితం అవుతుందో తెలియడానికి స్క్రీనింగ్ పరిక్ష తెలియజేస్తుంది. రోగ నిర్ధారణ పరీక్షలు వలన శిశువుకు ఉన్న డౌన్స్ సిండ్రోమ్ ను గుర్తించగలవు.

'జౌన్ లంగ్డన్' అనే ఇంగ్లీషు వైద్యుడు తొలిసారిగా 1862వ సంవత్సరంలో ఈ మానసిక వైకల్యాన్ని గుర్తించాడు. అందుకే ఆయన పేరు మీదుగానే ఈ వ్యాధి "డౌన్స్ సిండ్రోమ్" అని పేరు పొందింది. 1866వ సం॥లో దీని గురించి విస్తృతంగా పరిశోధన చేయబడింది. నేషనల్ ఇన్ స్టిట్యూట్ అఫ్ హెల్త్, యునైటెడ్ స్టేట్స్ వారు ఈ వైకల్యానికి డౌన్స్ సిండ్రోమ్ అని 1975 లో పేరు పెట్టడానికి ఒక సమావేశం నిర్వ హించారు. గుర్తించబడని వారసత్వాల కలయిక వల్ల సంభవించిందని వైద్యులు భావించారు.

గర్భధారణ సమయంలో పరిక్షలు చేయించుకోవడం, గర్భవతుల వయస్సు మీరకుండా చూసుకోవడం చేస్తే చాలా వరకు ఇటువంటి పైకల్యాలు నివారించవచ్చు. ఒక వేళ వైకల్యంతో జన్మించినా వారికి తగిన సహాయం అందించి వారి కాళ్ళపై వారు నిలబడేలా ప్రయత్నించాలి. వారికి బాధపెట్టడం, ఎగతాళి చేయడం తగదు.

## గురుకుల పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే

**తెలంగాణ ప్రభ (కోరుట్ల) :** మెటుపల్లి మండలం పెద్దాపూర్ గ్రామంలోని గురుకుల పాఠశాలను కోరుట్ల ఎమ్మెల్యే డా.కల్వకుంట్ల సంజయ్ సోమవారం సందర్శించారు. ఇటీవలె పాఠశాలలో జరిగిన ఘటనపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ విద్యార్థులతో మాట్లాడుతూ పాఠశాలలో ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఎప్పుడు మీకు అందుబాటులో ఉంటానని విద్యార్థులకు భరోసా ఇచ్చారు. వారితోపాటు నా యకులు దారిశెట్టి రాజేష్, మారుసాయిరెడ్డి, కోరేపు రవి,బీఆర్ఎస్ నాయకులు తదితరులున్నారు.



## వేలం పాటలో 6వేలకు ఇసుక స్వాధీనం

**తెలంగాణ ప్రభ (కోటగిరి) :** పోతంగల్ మండలంలోని తాహసిల్దార్ కార్యాలయంలో ఆదివారం రెవెన్యూ అధికారులు స్వాధీనం పరుచుకున్న ఇసుక డంపులను సోమవారం వేలంపాట నిర్వహించగా హంగర్గ ఫారం గ్రామానికి చెందిన దయాకర్ రెడ్డి రూ. 6వేలకు దక్కించుకున్నాడని తాహసిల్దార్ మల్లయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంజీరా నది నుంచి అనుమతి లేకుండా ఇసుక అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.





## సీరియల్ కిల్లర్‌గా

# మాధురీ దీక్షిత్!

బాలీవుడ్ సీనియర్ తార మాధురీ దీక్షిత్ తాజాగా ఓ వెబ్ సిరీస్ లో సీరియల్ కిల్లర్ గా నటించనుంది. ఈ వెబ్ సిరీస్ పేరు మిస్టర్ దేశ్ పాండే. నగేశ్ కుకునూర్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ వెబ్ సిరీస్ సైకలాజికల్ థ్రిల్లర్ జానర్ లో రూపొందనుంది. మిస్టర్ దేశ్ పాండే కథాంశం విషయానికొస్తే... ఓ సీరియల్ కిల్లర్ ను పట్టుకోవడానికి పోలీసులో మరో సీరియల్ కిల్లర్ సహకారం తీసుకుంటారు. ఓ ఫ్రెంచ్ వెబ్ సిరీస్ కు రీమేక్ గా దీన్ని నిర్మిస్తున్నారు. ఒకట్రెండు నెలల్లో చిత్రీకరణ ప్రారంభం కానుంది. ఈ మేరకు జాతీయ మీడియాలో కథనం వెలువడింది. ఇందులో మాధురీ దీక్షిత్ సీరియల్ కిల్లర్ రోల్ లో ఎలా నటిస్తుందన్నది ఆసక్తి కలిగిస్తోంది. మాధురి ప్రస్తుతం కార్తీక్ ఆర్యన్, విద్యాబాలన్ నటిస్తున్న భూల్ భులాయియా-3లోనూ ఓ కీలక పాత్ర పోషిస్తోంది. ఈ చిత్రం దీపావళికి ప్రేక్షకుల ముందుకు రానుంది.